రంజాన్ వేళలు ఇఫ్తార్ (ఆది) సా.6.20 సహరి (సోమ) ఉ.4.54

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

ఆదివారం 9 మార్చి 2025 | 5



ముగ్గుల్లో మహిళల జీవితాలు!

కేంద్రపాలిత ప్రాంతం యానాంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పలువురు మహిళలపై అఘాయిత్యాలు, స్త్రీశక్తి, అతివలు సాధిస్తున్న విజయాలను ఇతివృత్తాలుగా తీసుకుని వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. - **యానాం**



మహిళలకు ఒక్కరోజు ఉచితంగా గోదావరి బోటు షికారు -7లో

మహిళా దినోత్సవం రోజున.. మెడపై నరికేశాడు!

అనాతవరంలో యువతిపై కత్తితో దాడి చేసిన యువకుడు

7

మానవజాతి మనుగడకు మహిళలే ఆధారం!



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి. చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు



అమలాపురంలో మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యేలు

- మహిళా సాధికారితతోనే స్వర్ణాంధ్ర-2047 సాధ్యం
- వాట్సాప్ గవర్నెన్స్‌లో 500 రకాల సేవలు
- మహిళల్లో పురుషుల కంటే మానసిక దృఢత్వం ఎక్కువ : మంత్రి అచ్చెన్నాయుడు
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అమలాపురం, మార్చి8(ఆంధ్రజ్యోతి): మానవ జాతి మనుగడకు మహిళలే ఆధారమని రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మహిళా సాధికారితతోనే స్వర్ణాంధ్ర-2047 సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లాస్థాయిలో స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో నిర్వహించిన వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు సామాజిక, ఆర్థికరంగాల్లో స్వావలంబన సాధించాలన్నారు. స్వతంత్రంగా ఆర్థిక పరిపుష్టి సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ హయాం నుంచి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఆస్తిలో హక్కు కల్పించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో మహిళా సంక్షేమాన్ని మరింత పురోగతివైపు నడిపిస్తున్నారన్నారు. డొక్కా సీతమ్మ ఎంతో దాతృత్వంతో ఎందరో ఆకలిని తీర్చి కోనసీమ ఖ్యాతిని ఇనుమడింపజేశారన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో స్వేచ్ఛా సమానత్వం కోసం సాగిస్తున్న పోరాటాలను స్మరించుకునేలా ప్రతీ ఏటా 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తూ ఉత్తేజపరుస్తున్నారన్నారు. అమ్మగా, ఆలిగా, అక్కగా, చెల్లిగా, ఆత్మీయత పంచే మాతృమూర్తి మహిళ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన అందించే దిశగా వాట్సాప్ గవర్నెన్స్ ప్రవేశపెట్టిందని, దీని ద్వారా 500 రకాల సేవలు ప్రజలకు ఈనెల చివరి నాటికి అందుబాటులోకి రానున్నాయన్నారు. అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీని పెంచడం జరిగిందన్నారు. ఎన్నో సమస్యలను జీవితంలో సహనం, ఓర్పుతో ఎదుర్కొంటున్న మహిళలు పురుషులకంటే మానసిక దృఢత్వంలో ముందున్నారన్నారు. మేనెలలో తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. మహిళ పేరిట విశాలమైన, ఆహ్లాదకరమైన గృహాలను నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించిందని అచ్చెన్నాయుడు తెలిపారు.



డ్వాక్రా ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

మహిళ లేకుంటే సృష్టే లేదు..

మహిళ లేకుంటే సృష్టికి ఆధారమైన జననం, గమనం కూడా లేదని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళల హక్కుల గురించి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎన్నో పోరాటాలు సాగించారన్నారు. మహిళల అభ్యున్నతికి బాటలు వేసిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. 1996లోనే డ్వాక్రా సంఘాలను ఏర్పాటుచేయడం ద్వారా సీఎం చంద్రబాబు మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ముమ్మిడివరం, కొత్తపేట ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, బండారు సత్యానందరావులు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లోను సత్తా చాటుతున్నారన్నారు. ఏ రంగంలోను తాము బలహీనులమనే భావనను దరిచేరనీయకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారన్నారు. ఎమ్మెల్సీలు యిళ్ల వెంకటేశ్వరరావు, బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావులు మహిళలు సాధిస్తున్న విజయాలను వివరించారు. ప్రతీ పురుషుని విజయం వెనుక మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.



జిల్లా పరిశ్రమల కేంద్రం నుంచి రూ.3.88 కోట్ల చెక్కును అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి : కలెక్టర్

మహిళలు ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కుల వంటి విధానాలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆకాంక్షించారు. కోనసీమలో కొబ్బరి, ఆక్వా ఉత్పత్తులతో విలువ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పుకుని పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. సమాజంలో మహిళల పట్ల ఉన్న ఆలోచనా ధోరణిలో మార్పురావాలన్నారు. జేసీ టి.నిషాంతి మాట్లాడుతూ మహిళలు విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సమాజం ఎంతో మార్పు చెందుతుందన్నారు. ఆర్డీవో కె.మాధవి మాట్లాడుతూ కుటుంబ ఉన్నతికి మహిళలే మూలమన్నారు. కాగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు పలు విభాగాల్లో ఆర్థికసాయం చెక్కులను మంత్రి అచ్చెన్నాయుడు పంపిణీ చేశారు. డీఆర్డీఏ ద్వారా 650 గ్రూపులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద రూ.130 కోట్లు, ఏడు మండల మహిళా సమాఖ్యలకు సీఐఎఫ్ నిధి కింద రూ.1.05 కోట్లు, 83మంది లబ్ధిదారులకు పీఎం అజయ్ పథకం కింద రూ.1.40 కోట్లు, మెప్మా ద్వారా 81 గ్రూపులకు రూ.7.03 కోట్లతోపాటు పలు రుణాలను మహిళలకు పంపిణీ చేశారు.

ప్రతిభావంతులకు సత్కారాలు

విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులతోపాటు మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేసి సత్కరించారు. మహిళలు సాధిస్తున్న విజయాలను మంత్రి కొనియాడారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు అద్దంపట్టే విధంగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, మాజీ మంత్రి పరమట వీరరాఘవులు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పీకే పీ ప్రసాద్, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ఈతకోట పరిధిలో సాగునీరు అందక బీటలువారుతున్న పంటపొలాలు.. గోపాలపురం లాకుల వద్ద నుంచి పంటపొలాలకు నీరు అందించే కాలువ తూడు, గుర్రపుడెక్కతో మూసుకుపోయిన దృశ్యం

నీరందక..

- బీటలు వారుతున్న పొలాలు
- వంతు సమయంలోనూ నీటిమట్టం తక్కువే
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఇంజన్ల సాయంతో పొలాలకు సాగునీరు అందిస్తున్న రైతులు
- నీటి ఎద్దడితో దిగుబడిపై ప్రభావం.. రైతుల ఆందోళన

రావులపాలెం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు సాగునీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో సాగునీటి ఎద్దడి తలెత్తడంతో ఆ ప్రభావం పంట దిగుబడిపై పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రావులపాలెం మండలంలో ప్రస్తుత రబీసీజన్‌లో 1121, 126, 111, సన్నాల రకాలు, బొండాలు తదితర వరి వంగడాలను రైతులు సాగుచేశారు. కాగా ముందుగా నాట్లు వేసిన పంట పొలాలు ఈనిక పూర్తి చేసుకుంటుండగా, ఆలస్యంగా నాట్లు వేసిన పంటపొలాలు పొట్ట, ఈనిక దశకు చేరుకున్నాయి. వరి పంటపొలాలు పొట్టదశకు చేరుకున్నప్పటి నుంచి నీరు పుష్కలంగా ఉండాలి. అలా ఉన్నప్పుడే గింజలు సరైన రీతిలో పాలుపోసుకుని ధాన్యం దిగుబడి వస్తుంది. కానీ నేడు ఆ పరిస్థితి కనపడడం లేదు. పంట పొలాలు ఈనిక దశకు చేరుకున్నప్పటి నుంచి మండల పరిధిలోని పలు గ్రామాల్లోని శివారు ప్రాంత పంటపొలాలకు సాగునీటి ఎద్దడి తలెత్తడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సాగునీటి కాలువలు, పంట బోదెలు పూడుకుపోవడంతో పంటపొలాలకు నీరు అందని పరిస్థితి. శివారు ప్రాంత పంట పొలాల పరిస్థితి మరీ దయనీయం. ఆయా ప్రాంతాల్లో పంటపొలాలు నీటి ఎద్దడి వల్ల బీటలు వారుతున్నాయి. వంతుల వారీ సమయంలోను నీటిమట్టం తక్కువగా రావడంతో శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీరు అందడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వారు ఇంజన్ల సాయంతో పొలాలకు సాగునీరు అందిస్తున్నారు.



ఇంజన్ సాయంతో పొలాలకు నీరుపెట్టిన దృశ్యం

ఇంటర్ పరీక్షలకు 787 మంది గైర్హాజరు

ప్రశాంతంగా ప్రథమ సంవత్సర పరీక్షలు.. పరీక్షా కేంద్రాల్లో స్క్వాడ్‌ల తనిఖీలు

అమలాపురం టౌన్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. జిల్లాలో ఎక్కడా ఇప్పటివరకు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదన్నారు. జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రెండు సిటింగ్ స్క్వాడ్, కస్టోడియన్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమశేఖరరావు ముమ్మిడివరంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, తారా రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలల పరీక్షా కేంద్రాలను సందర్శించారు. కాగా జనరల్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 10,911 మందికిగాను 10519 మంది హాజరు కాగా, 392 మంది గైర్హాజరయ్యారు. గణితం-బి పరీక్షకు 8359 మందికిగాను 8118 మంది, జంతుశాస్త్రం పరీక్షకు 2219 మందికి 2214 మంది, చరిత్ర పరీక్షకుగాను 333 మందికి 287 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ ఇంటర్మీడియట్ విభాగంలో 2734 మంది విద్యార్థులకు 2339 మంది హాజరు కాగా, 395 మంది గైర్హాజరైనట్టు తెలిపారు.

నేడు పౌర సరఫరాల శాఖామంత్రి మనోహర్ రాక

అమలాపురం టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న పిఠాపురం నియోజకవర్గంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ నేపథ్యంలో అమలాపురంలో ఆదివారం నిర్వహించనున్న సన్నాహక సమావేశానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరుకానున్నట్టు సీనియర్ నేత నల్లా శ్రీధర్ తెలిపారు. అమలాపురం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో సాయంత్రం నాలుగు గంటలకు జనసేన శ్రేణులతో సమావేశం జరుగుతుందన్నారు.

రేపు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అమలాపురం టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసినందున ఈనెల 10వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జిల్లాస్థాయిలో యథావిధిగా జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి తెలిపారు. జిల్లా స్థాయితోపాటు మండల కార్యాలయాల్లో యథావిధిగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





అయినాపురంలో కొబ్బరితోటలో చెట్లు నరికి చెరువును తవ్వుతున్న దృశ్యం.. సోమిదేవరపాలెం మురుగునీటి కాల్వకు మట్టి తోలుకునేందుకు అడ్డుకట్ట వేసిన దృశ్యం



సోమిదేవరపాలెంలో కొబ్బరి తోటను చెరువుగా తవ్వుతున్న దృశ్యం

పచ్చని పంటపొలాల్లో ఆక్వా చెరువులు

అనుమతులు లేకుండానే తవ్వకాలు... కాలుష్య కాసారాలుగా మారుతున్నా అసలు పట్టించుకోని అధికారులు

ముమ్మిడివరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆక్వారంగం ఆటుపోట్లతో అంతంత మాత్రంగానే ఉన్నా కొత్తగా చెరువుల తవ్వకం మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. గతంలో సముద్ర తీర ప్రాంతాల్లోను, పర్ర భూముల్లోను, చౌడు భూముల్లోను చెరువులు తవ్వి ఆక్వాసాగు చేసేవారు. వరిగాని, ఇతర పంటలకుగాని అవకాశం లేని భూముల్లో చెరువు తవ్వి ఆదాయం పొందేవారు. అయితే ఇటీవల పచ్చని సారవంతమైన భూముల్లో కూడా ఆక్వా సాగుకు చెరువులు తవ్వేస్తున్నారు. వరి పండే భూములు, కొబ్బరి తోటల్లో యథేచ్ఛగా ఆక్వా చెరువులు తవ్వేస్తున్నారు. నివాసగృహాలు, పంటలు పుష్కలంగా పండే భూముల మధ్య ఆక్వాసాగు చేపట్టడంతో ప్రజలు కాలుష్యం బారినపడుతున్నారు. ఆక్వా సాగుకు చెరువు తవ్వాలంటే రెవెన్యూ, ఫిషరీస్, వ్యవసాయశాఖ, ఇరిగేషన్, డ్రైనేజీ, పొల్యూషన్ శాఖల అధికారులతో కూడిన కమిటీ అనుమతి తీసుకుని చెరువు తవ్వుకోవాల్సి ఉంది. చెరువులు తవ్వితే సాగునీరు, మురుగునీటి పారుదలకు ఎటువంటి ఇబ్బందులు లేవని గుర్తించిన తరువాతే కమిటీ అనుమతి ఇస్తుంది. అయితే అటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెరువులు తవ్వేస్తున్నారు. అయినాపురం పంచాయతీ పరిధిలోని సుమారు ఏడు ఎకరాల్లో కొబ్బరి తోటలో చెట్లను తెగనరికి బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంటకాల్వను ఆనుకుని ఆక్వా చెరువు తవ్వేస్తున్నారు. వీరికి రాజకీయ పలుకుబడి ఉండడంతో అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడడంలేదు. అలాగే ఇదే మండలంలోని సోమిదేవరపాలెంలో కూడా ఒక కొబ్బరితోటలో ఆక్వాచెరువును తవ్వుతున్నారు. ఆ చెరువులోని మట్టిని బయటకు రవాణా చేసేందుకు సోమిదేవరపాలెం డ్రైన్‌పై ఏకంగా అడ్డుకట్టవేసి ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. వీటిపై రైతులు జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్వా చెరువుల తవ్వకాలు నిలిపివేయాలని ఆయా గ్రామాల్లో రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆక్వాచెరువుల తవ్వకం వల్ల భూగర్భజలాలు కలుషితమై పరిసరాలు కూడా కలుషితం అవ్వడంతో తమ భూములు సారం కోల్పోయి పంటలు పండే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు మాత్రమే..



ఒక్కరోజు ఉచిత బోటు ప్రయాణం

యానాం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వం పుదుచ్చేరిలోని మహిళలకు ఒక్కరోజు ఉచిత బోటు ప్రయాణం కల్పించింది. పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి ఆదేశాల మేరకు పర్యాటకశాఖ ఆధీనంలో ఉన్న బోట్‌హౌస్‌లో ఈ సౌకర్యం కల్పించారు. దీంతో యానాం పర్యాటకశాఖ ఆధీనంలోని సీగల్స్ బోటుహౌస్‌లో మహిళలకు ఉచిత బోటు షికారు అవకాశం కల్పించారు. పలువురు మహిళ న్యాయవాదులు, టీచర్లు, ప్రజలతో పాటు బీచ్ పర్యాటనకు వచ్చిన మహిళలు యానాం గౌతమీ గోదావరిలో బోటులో విహరించారు. కార్యక్రమాన్ని యానాం పరిపాలనాధికారి మునిస్వామి,సీగల్స్ మేనేజర్ మురళిధరన్ పర్యవేక్షించారు.


యానాం గోదావరి బోటులో విహరిస్తున్న మహిళలు

14న పండుగలా జనసేన ఆవిర్భావ సభ

కాకినాడలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రారంభించిన మంత్రి నాదెండ్ల


కాకినాడలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభను కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం చిత్రాడ గ్రామంలో ఈనెల 14న పండుగలా నిర్వహిస్తామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. సభకు వచ్చేవారికి ఏవిధమైన ఇబ్బందులు రాకుండా చూసుకునేందుకు వివిధ కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఈ కమిటీలకు ఎప్పటికప్పుడు సమన్వయం చేసేందుకు కాకినాడలోని కుళాయి చెరువు ప్రాంగణంలో ఉన్న గోదావరి కళాక్షేత్రంలో కంట్రోల్ రూమ్‌ను మంత్రి నాదెండ్ల శనివారం ప్రారంభించారు. ఆవిర్భావ సభకు వచ్చే ఇరు రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల జన సైనికులు, వీరమహిళలు నాయకులు, పవన్‌కల్యాణ్ అభిమానులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ఎప్పటికప్పుడు ఈ కంట్రోల్ నుంచి తమ అధి నాయకుడు పవన్‌తో సహా అందరూ పర్యవేక్షిస్తారన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ ఇప్పుడిప్పుడే రాక్షక పాలన నుంచి విముక్తి చెంది ఊపిరి పీల్చుకుంటున్నారన్నారు. తమ పార్టీ ఆవిర్భావ సభ ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలుస్తుందన్నారు. పార్టీలో ఉన్న ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి శ్రమిస్తున్నారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత 13ఏళ్లలో పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్కరినీ గుర్తుపెట్టుకుని సముచిత న్యాయం చేస్తామన్నారు. సభకు 10 నుంచి 15లక్షల మంది కార్యకర్తలు, అభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గ ప్రజలు పవన్‌కు అద్భుతమైన విజయాన్ని అందించారని, ఈ సభలో వారికి కృతజ్ఞతలు తెలియజేస్తామన్నారు. విచ్చేసే అభిమానులు, కార్యకర్తలు, నాయకులందరికీ ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకూడదనే లక్ష్యంతో 14 కమిటీలు ఏర్పాటు చేశామని, అవి నిరంతరం పర్యవేక్షిస్తాయన్నారు. సభలో భవిష్యత్తు కార్యాచరణపై అభివృద్ధి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఇతర ఎమ్మెల్యేలు బత్తుల బలరామ కృష్ణ, నిమ్మల జయకృష్ణ, లోకం మాధవి, కొత్తపల్లి సుబ్బారాయుడు, సివిల్ సప్లై చైర్మన్ తోట సుధీర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజ మార్గం

పీడీజే గంధం సునీత



ఇన్సూరెన్స్ కంపెనీ పరిహార చెక్కు నమూనాను బాధితులకు అందజేస్తున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజ మార్గమని.. తద్వారా కేసులను పరిష్కరించుకుంటే కోర్టులపై భారం తగ్గుతుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రాజమహేంద్రవరం డీఎల్ఎస్ ఏలో లోక్ అదాలత్‌ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలో సుమారు 80 వేల కేసులు పెండింగ్‌లో ఉండగా ఈ దఫా 10 వేల కేసులను లోక్ అదాలత్‌కి తగినవిగా గుర్తించామని, వాటిలో 5916 కేసులు పరిష్కరించినట్టు చెప్పారు. కక్షిదారులకు కోర్టు ఫీజులను కూడా తిరిగివ్వడం జరుగు తుందన్నారు. ప్రజల్లో లోక్ అదాలత్‌పై మరింతగా అవగాహన పెంచడం ద్వారా సత్వర న్యాయం జరిగేలా చూడడం సామాజిక బాధ్యత అని పీడీజే పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 42 న్యాయపీఠాల ద్వారా రూ.18.33 కోట్ల పరిహారానికి సంబంధించి అవార్డు అందజేశామన్నారు. కార్యక్రమంలో 1వ ఏడీజే ఆర్.శివ కుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ ఉన్నారు.

ఆకట్టుకున్న 'ఎడారిలో వాన చినుకు'

గొల్లప్రోలు రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను తల్లిదండ్రులను వృద్ధాప్యంలో చిన్నచూపు చూస్తున్నారు నేటి తరం పిల్లలు. ఆప్యాయతలు కనుమరుగవుతున్నాయి. అటువంటి వారికి బుద్ధిచెప్పిన దంపతుల ఇతి వృత్తాన్ని ఎడారిలో వాన చినుకు నాటకం ద్వారా కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు కాకినాడ శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్ కళాకారులు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో అపర్ణాకళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటకాల పోటీల్లో భాగంగా తొలిరోజు ప్రదర్శించిన ఈ నాటకం అందరిని ఆకట్టుకుంది. ఈ నాటకాన్ని సారదా ప్రసన్న రచించగా, సీహెచ్ మహేష్ దర్శకత్వం వహించారు.


నాటకంలోని ఓ దృశ్యం

చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌ల ఏర్పాటు

మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ

కాపవరం, బలభద్రపురం గ్రామాల్లో భూముల పరిశీలన


బలభద్రపురంలో స్థల వివరాలను తెలుసుకుంటున్న మంత్రి

బిక్కవోలు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా మున్సిపాలిటీల నుంచి వచ్చే చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. దీనిలో భాగంగా ప్లాంట్ నిర్మాణం కోసం తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరం శివార్లలో జిల్లా పరిషత్‌కు సంబంధించిన 12 ఎకరాల భూములను, బలభద్రపురంలోని ఏపీ ఇండస్ట్రియల్ భూములు 34 ఎకరాలను ఆయన శనివారం పరిశీలించి మాట్లాడుతూ రాజమహేంద్రవరం- కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు చుట్టు పక్కల మున్సిపాలిటీల నుంచి చెత్తను కొత్తగా ఏర్పాటు చేసే ప్లాంట్‌కు తరలించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా ప్లాంట్ ఏర్పాటుకు బలభద్రపురం, కాపవరం గ్రామాల్లోని జడ్పీ, ఏపీ ఇండస్ట్రియల్ భూములను పరిశీలించినట్టు చెప్పారు. ప్లాంట్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులను తహశీల్దార్ సత్యకృష్ణ, రాజమహేంద్రవరం మున్సిపాలిటీ ఈఈ-2 మాధవిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటు చేసే క్రమంలో చుట్టు పక్కల మున్సిపాలిటీలకు అనుకూలంగా ఉండేలా స్థలాన్ని అన్వేషిస్తున్నామని, అందుకు మున్సిపల్ శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. సీఎం చంద్రబాబు ఆలోచనలతో స్వచ్ఛ ఆంధ్ర సాధన దిశగా కసరత్తు జరుగుతోందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే ప్లాంట్‌లో 20 మున్సిపాలిటీల నుంచి సేకరించిన వ్యర్థాల నుంచి సంపద సృష్టి, విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్టు మంత్రి నారాయణ వివరించారు.

సీతారామచంద్రస్వామి జీర్ణోద్ధరణ మహోత్సవంలో చిన్నజీయర్‌స్వామి



జీర్ణోద్ధరణ కార్యక్రమానికి విచ్చేస్తున్న చిన్నజీయర్‌స్వామి, ఉత్సవమూర్తుల విగ్రహాలను చూస్తూ...

సర్పవరం జంక్షన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సర్పవరంలో గత 3 రోజులుగా నిర్వహిస్తోన్న హనుమ, లక్ష్మణ సహిత శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహోత్సవ కార్యక్రమానికి శనివారం చిన్నజీయర్‌స్వామి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా భీమవరం త్రిదండి చిన్న రామచంద్రజీయర్ స్వామి, గోవిందా జీయర్, త్రిదండి అహోబిల రామానుజజీయర్‌స్వామిల ఆధ్వర్యంలో స్వామి వారికి శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, చతు:స్థానార్చన, తత్వత్వన్యాస హోమం, యంత్రస్థాపన, బింబస్థాపన, నివేదన, పూర్ణాహుతి, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి వంటి పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తుల సంప్రోక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం సమీపంలో ఉన్న శ్రీరాజ్యలక్ష్మి భావనారాయణస్వామి ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు, ఆలయ పురాతన విశిష్టతను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పురాణం వెంకటాచార్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జీర్ణోద్ధరణ మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా శ్రీనారసింహ ఇష్టి, చతు:స్థానార్చన, గోపూజ, సుందరకాండ పారాయణ, దివ్య ప్రబంధ పారాయణం, సంక్షేప రామాయణ హవనం, మూల మంత్ర, మూర్తి మంత్ర హవనాలు, పూర్ణాహుతి, మంగళాశాసనం వంటి పూజలు జరిగాయి.

మహిళా దినోత్సవం రోజున.. మెడపై నరికేశాడు!

యువతిపై కత్తితో దాడి చేసిన యువకుడు


దాడిలో గాయపడిన యువతి

ముమ్మిడివరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం రోజున ఓ యువతిపై యువకుడు కత్తితో దాడి చేసి మెడపై నరికిన సంఘటన ముమ్మిడివరం మండలం అనాతవరంలో జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అనాతవరం ఎదురుమూడి వుంతలో పంతగంటి జయరామకృష్ణ, చాట్ల మాలతి పక్కపక్కన ఇళ్లల్లో ఉంటున్నారు. జయరామకృష్ణ వివాహితుడు కాగా భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మాలతి కూడా వివాహిత. భర్త బుల్లియ్య ఉపాధి నిమిత్తం ఏలూరులో చెరువుల వద్ద ఉంటున్నాడు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే శనివారం మధ్యాహ్నం మాలతి ఇంటి నుంచి బయటికి వెళ్తున్న సమయంలో చుట్టుపక్కల పిల్లలంతా ఆడుకుంటూ అల్లరి చేస్తుండగా వారిని ఆమె గట్టిగా మందలించింది. ఆ సమయంలో జయరామకృష్ణ ఇంట్లో నుంచి కత్తితో వచ్చి ఆమె మెడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అపస్మారక స్థితికి వెళ్లడంతో మాలతిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే గతంలో ఇరుగుపొరుగువారు ఎవరు గొడవ పడినా జయరామకృష్ణకు కిట్టేది కాదని, గట్టిగా మాట్లాడుకున్నా, గొడవపడినా ప్రశాంతంగా ఉండాలని వారిని హెచ్చరించేవాడని, ఈ క్రమంలోనే అల్లరిచేస్తున్న పిల్లలను మందలిస్తున్న మాలతిపై ఉద్రేకంతో కత్తితో మెడపై దాడి చేశాడని పోలీసులు పేర్కొంటున్నారు. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి వెళ్లి ఇరుగుపొరుగువారిని విచారించి ఆధారాలు సేకరించారు. క్లూస్‌టీమును రప్పించి ఆధారాలు సేకరించారు. నిందితుడు జయరామకృష్ణను అదుపులోకి తీసుకుని దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మాలతి ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతుంది.


దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ మోహన్ కుమార్, ఎస్ఐ జ్వాలాసాగర్

లారీని ఢీకొని యువకుడి మృతి

ఎక్సైజ్ అధికారులు వెంటపడడంతో ప్రమాదం జరిగినట్టు బంధువుల ఆరోపణ

సుంకరపాలెం ఎక్సైజ్ చెక్‌పోస్టు ముట్టడి


లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం


మృతిచెందిన కోట శ్రీరామ్ (ఫైల్)

తాళ్లరేవు/జీజీహెచ్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం యానాం-ద్రాక్షారామ రహదారిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందగా మరో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరప మండలం అడవిపూడి గ్రామానికి చెందిన కోట శ్రీరామ్(21) కాకినాడ ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. శనివారం సాయంత్రం తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై యానాం-ద్రాక్షారామ రోడ్డులో వెళ్తుండగా ఇంజరం వద్ద వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. దీంతో యువకులకు తీవ్రగాయాలయ్యాయి. కోట శ్రీరామ్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మరో విద్యార్థి చికిత్స పొందుతున్నాడు. అయితే సుంకరపాలెం ఎక్సైజ్ చెక్‌పోస్టు అధికారులకు ఆ యువకులు మద్యం తరలిస్తున్నారన్న అనుమానం వచ్చి వారి వెంటపడిన కారణంగా యువకులు వేగంగా వెళ్లి లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని, అధికారుల నిర్లక్ష్యంతో నిండుప్రాణం బలైపోయిందని బంధువులు శనివారం రాత్రి సుంకరపాలెం చెక్‌పోస్టును ముట్టడించి యువకుడి మృతికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కోరంగి పోలీసులు కేసు నమోదుచేశారు.

ఆరో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

- రంప మన్యం ఆశ్రమ పాఠశాలలో ఘటన
- ఆరా తీసిన ఎమ్మెల్యే శిరీషదేవి
- విచారణకు ఆదేశించిన కలెక్టర్


మృతిచెందిన గిరిజన విద్యార్థిని

రంపచోడవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం వాడపల్లి ఆశ్రమోన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న దోరి అశ్విని(11) శనివారం పాఠశాల అనుబంధ వసతిగృహంలోనే ఆత్మహత్యకు పాల్పడింది. దీని వివరాలిలా ఉన్నాయి. ఈ పాఠశాలలో ఉదయం అల్పాహారం తీసుకున్న అనంతరం వసతిగృహంలోకి వెళ్లి చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందిందని ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తెలిపారు. హుటాహుటిన విద్యార్థినిని వాడపల్లి ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందిందని ధ్రువీకరించారు. ఇదిలా ఉండగా సదరు విద్యార్థిని తన ఆత్మహత్యకు కారణాలను వివరిస్తూ ఒక లేఖను కూడా రాసి విడిచిపెట్టినట్టు తెలుస్తోంది. విషయం తెలిసిన వెంటనే రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి వాడపల్లి ఆశ్రమ పాఠశాలకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ఇతర విద్యార్థినులతో మాట్లాడి సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఇటువంటి సంఘటనలు బాధాకరమని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీడియాలో ఈ గిరిజన విద్యార్థిని ఆత్మహత్య ఘటన ప్రసారం అవుతుండడంతో అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్ తక్షణం స్పందించి విచారణకు ఆదేశించారు. అనంతరం రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పాఠశాలకు వెళ్లి ప్రాథమిక విచారణ జరిపారు. అత్యవసరంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ ఘటనపై రంపచోడవరం పోలీసు స్టేషన్‌లో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదై దర్యాప్తు ప్రారంభమైంది. గిరిజన బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.


పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

రూ.58 లక్షల ఆదాయం


ఆలయంలో పోటెత్తిన భక్తులు


వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాల బోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో 7 ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించి తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. మహిళా దినోత్సవం, రెండవ శనివారం సెలవు కావడంతో వేలాది మంది భక్తులు వాడపల్లి తరలివచ్చారు. సుమారు 60వేల మంది స్వామిని దర్శించుకోగా 25వేల మంది అన్నప్రసాదం స్వీకరించినట్టు అధికారులు అంచనా వేశారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.58 లక్షల ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారిని విశాఖ జిల్లా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. స్వామివారి చిత్రపటాన్ని ఈవో అందించారు.


పెందుర్తి ఎమ్మెల్యే రమేష్‌బాబు కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

శృంగారవల్లభ స్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి గ్రామంలో తొలి తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవీ సమేత శృంగారవల్లభస్వామి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. వేకువజాము నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని సుమారు 20వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి రూ.3,55,197 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

బాలబాలాజీకి ప్రత్యేక పూజలు

మామిడికుదురు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తుల కోలాహలంగా మారింది. వేకువజామున అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అర్చకులు ఉభయ దేవేరులను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.3,36,594 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 5వేల మంది దర్శించుకుని నిత్యాన్నదాన పథకంలో 3వేలమంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు పేర్కొన్నారు.

నేటి నుంచి కోరుకొండలో..

నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

తీర్థానికి తరలిరానున్న భక్తులు


కోరుకొండ కొండపైన స్వయంభుగా వెలిసిన నరసింహస్వామివారు

కోరుకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభం కానున్నాయి. పాల్గుణశుద్ధ దశమి ఆదివారం సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణతో కార్యక్రమాలు వైకానస ఆగమనం ప్రకారం ప్రారంభమవుతాయి. ఈనెల 10వ తేదీ సోమవారం ఒంటి గంటకు రథోత్సవం, రాత్రి 9 గంటలకు కల్యాణ మహోత్సవం. 11వ తేదీ మంగళవారం రాత్రి గరుడ వాహనంసేవ, 12వ తేదీ బుధవారం రాత్రి 7గంటలకు స్వామివారి సదస్యం, రాత్రి 9 గంటలకు హనుమద్వాహనంపై గ్రామోత్సవం, 13తేదీ గురువారం రాత్రి 8 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, శ్రీరంగరాజస్వామి ఆలయంలో రాత్రి 8 గంటలకు రంగనాథ స్వామి కల్యాణం, 14వ తేదీ శుక్రవారం దేవుని కోనేరు వద్ద చక్రతీర్థం, సాయంత్రం ధ్వజ అవరోహణ, అద్దాల సేవ, ఊంజల సేవ, రాత్రి 9గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవం, 15వ తేదీ శనివారం రాత్రి స్వామి వారికి శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తీర్థానికి భక్తులు తరలి వస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నవరం దేవస్థానం దత్తత ఆలయంగా ఉన్న నరసింహ స్వామి మహోత్సవాలను కనుల పండువగా నిర్వహించాలని అన్నవరం ఆలయ వ్యవస్థాపక కుటుంబీకుడు ఐవీ రోహిత్ అధికారులకు సూచించారు. రంగరాజభట్టర్ స్వీయ పర్యవేక్షణలో వైఖానస ఆగమబ్రహ్మ పాణింగపల్లి పవనకుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చకస్వాములు ఉత్సవాలు నిర్వహిస్తారు.

మిల్క్‌బాయిలర్స్ ఆందోళన విరమణ

యానాం, మార్చి8(ఆంధ్రజ్యోతి):స్థానికపరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో వేతనాలు పెంచాలని కోరుతూ యానాం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తోన్న మిల్క్‌బాయిలర్స్ ఆందోళన చేపట్టారు. న్యాయవాదులు కమిడి విజయ్‌కుమార్, స్వారాజ్యలక్ష్మి, మోక్షిత, భ్రమరాంబిక, ఉషా రాణిలు వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

పారిశుధ్య పనులు

యానాం,మార్చి8(ఆంధ్రజ్యోతి): యానాంలో డం ఎంగ్ యార్డు మూసివేయడంతో వారం రోజులుగా ఎక్కడిచెత్త అక్కడే ఉండిపోవడంతో రోడ్లన్నీ కంపుతో అధ్వానంగా తయారయ్యాయి. యానాం వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాడి కృష్ణారావు ఇచ్చిన పిలుపుతో 20ట్రాక్టర్లు, 100మంది సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు.

నియోజకవర్గాల వారీగా కుట్టుశిక్షణ కేంద్రాలు



అమలాపురంలో మహిళల కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గాల వారీగా ప్రభుత్వం కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. శనివారం అమలాపురంలోని కోనసీమ మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. 90రోజుల శిక్షణ అనంతరం 75శాతం హాజరు ఉన్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తారన్నారు. బీసీ సంక్షేమం, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, కమ్మ, సామాజికవర్గాల్లో వెనుకబడిన వర్గాల్లో మహిళలను ఎంపికచేసి నిష్ణాతులతో వారికి శిక్షణ అందిస్తామన్నారు. జిల్లాలో 3,243 మంది మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, దున్నాల దుర్గ, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

పి.గన్నవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈనెల14న పిఠాపురం నియోజకవర్గ పరిధి చిత్రాడలో జరిగే బహిరంగ సభకు తరలి వెళ్లాలన్నారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ సమన్వయకర్తలు కరాటం సాయి, పి.చంద్ర మోహన్‌లు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిదర్శనం ప్రస్తుతం జరుగుతున్న రహదారుల అభివృద్ధేనని, దీనికి ఎమ్మెల్యేకి వారు అభినందనలు తెలిపారు. తొలుత లంకలగన్నవరం గ్రామజనసేన సర్పంచ్ పసలపూడి రామకృష్ణ ఇటీవల మృతిచెందగా సంతాపం తెలిపారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, మద్దా చంటిబాబు, జాలెం శ్రీనివాస రాజా, దొమ్మేటి సాయికృష్ణ, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, యల్లమిల్లి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

366 కేసులు పరిష్కారం

అమలాపురం టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అమలాపురం కోర్టు ప్రాంగణంలో శనివారం రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రూ.4.69కోట్లు విలువైన 366 కేసులను పరిష్కరించారు. వాటిలో 31 సివిల్ కేసులు, 20 బీఎస్ఎన్, 5 బ్యాంకు కేసులు, 280 క్రిమినల్ కేసులు, 30 మోటారు యాక్సిడెంట్ కేసులు పరిష్కరించారు. లోక్అదాలత్‌లో సివిల్ జడ్జి ఎ.సాయికుమారి, మరోసివిల్‌జడ్జి ఎండీ రహ్మతుల్లా, లోక్ అదాలత్ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

328 కేసులు పరిష్కారం

ముమ్మిడివరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ప్రాంగణంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహ్మద్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్అదాలత్‌లో 320కేసులు పరిష్కారమయ్యాయి. బార్అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, ఏజీపీ తిరుకోటి శాంతిసుధ, కేఎల్వీ ప్రసాదరావు, గంధి రామారావు, జి.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఎం.ఆలీహసన్, అయినవిల్లి వలీబాబా, ముడే వెంకట్రావు, పి.నరేష్ పాల్గొన్నారు.

యానాంలో లోక్ అదాలత్

యానాం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): యానాం సబ్ కోర్టులో తాలుకా లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో 29కేసులు పరిష్కరించినట్టు కమిటీ చైర్మన్, న్యాయమూర్తి రాజమోహన్ తెలిపారు. శనివారం స్థానిక కామెశెట్టివారి వీధిలోని యానాం సబ్‌కోర్టు ఆవరణలో లోక్అదాలత్ నిర్వహించారు. రూ.31,94,995 విలువైన 29కేసులు పరిష్కారం అయ్యాయన్నారు.

ఓడలరేవులో కొనసాగుతున్న ఆందోళన

అల్లవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు చమురు నిక్షేపాలు కొల్లగొడుతున్నాయని, ఓఎన్జీసీ భారీ వాహనాల వల్ల రోడ్లు దెబ్బతింటున్నా అధికారులు పట్టించుకోవడంలేదని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు ఓఎన్జీసీ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద కూటమి నేతల సహకారంతో గ్రామస్తులు చేస్తున్న ఆందోళన ఆరో రోజు కొనసాగింది. ఓఎన్జీసీ టెర్మినల్ గేటు వద్ద దెందుకూరి సత్తిబాబురాజు, కూటమి నాయకులు ధర్నాచేసి నిరసన తెలిపారు. టెర్మినల్ ప్రహరీని ఆనుకుని అపరిశుభ్రంగా ఉన్న డ్రైన్‌లో కూటమి నాయకులు చెత్త తొలగించి వినూత్న నిరసన తెలిపారు. ఓడలరేవు గ్రామ దత్తత, గ్రామాభివృద్ధి, స్థానిక యువకులకు ఉద్యోగ అవకాశాలు తీరప్రాంత రక్షణ తదితర డిమాండ్లతో ఆందోళన కొనసాగిస్తున్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, కొల్లు విష్ణుమూర్తి, మంతెనసురేష్‌రాజు, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, నాతి లెనిన్‌బాబు, రేకాడి శేషగిరి, పినపోతు రామకృష్ణ, పెమ్మాడి వెంకట రామారావు, మందపాటి రామకృష్ణ, జనసేన నాయకురాలు కామాడి గంగాభవానీ, అధిక సంఖ్యలో గ్రామస్తులు ధర్నా, నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. నిరసన శిబిరం వద్ద వంటావార్పుతో ఆందోళన సాగించారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం





అమలాపురం: ఎస్టీయూ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం, ముమ్మిడివరం: మహిళా పోలీసులకు సన్మానం, పి.గన్నవరం: వీర మహిళలను సన్మానించిన ఎమ్మెల్యే

పి.గన్నవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో వీరమహిళలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. మహిళల సాధికారత, హక్కుల కోసం జనసేన నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి, పెనుమాల లక్ష్మి, గాయిత్రీ, శిరీష, గరసాల దీపిక, ఏసమ్మ, లక్ష్మి, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనా రాయణ పాల్గొన్నారు. పి.గన్నవరం సీహెచ్‌సీలో బీజేపీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి ప్రధాని మోదీ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. అనంతరం స్థానిక బీజేపీ మండల నాయకులతో కలిసి మహిళా సిబ్బందిని ఆయన ఘనంగా సన్మానించారు. డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, చీకరమిల్లి శ్రీనివాసరావు, అడ్డాల వెంకటే శ్వరరావు, గొల్లకోటి సూర్యనారాయణ, కోలా గోపాలకృష్ణ, కుడిపూడి సూర్యనారాయణ, తోలేటి సుబ్బారావు, నల్లా పెద్దకాపు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్, (ఆంధ్రజ్యోతి): అమలాపురం జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం సీనియర్ నాయకుడు నల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్డీవో కె.మాధవి, డాక్టర్ శారద, సామాజిక కార్యకర్త సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. కోఆర్డినేటర్ బండారు శ్రీనివాస్, ఆర్డీవో మాధవిలు మహిళలు విభిన్న రంగాల్లో సాధిస్తున్న విజయాల కోసం వివరించారు. 50మంది పారిశుధ్య కార్మిక మహిళలకు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యాళ్ల నాగసతీష్, నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, యేడిద శ్రీను, పడాల శ్రీదేవి, తిక్కా సత్యలక్ష్మి, గొలకోటి విజయలక్ష్మి, ఇసుకపట్ల జయమణి, లింగోలు సత్యవతి, మోటూరి కనకదుర్గ, కొప్పుల నాగమానస, చిక్కం సుధ, చాట్ల మంగతాయారు, ఆకుల సూర్యనారాయణ, మోటూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షురాలు ఆర్.దుర్గ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. షంషాద్‌బేగం, ఎస్టీ మంజూష, ఎం.సీతామహాలక్ష్మి, సాయి దుర్గాభవానీ, డి.నాగవేణి, కె.సౌజన్య, కేవీకోమలి, బి.సూర్యకాంతం, కె.దివ్యలతో పాటు ఎస్.బాలకృష్ణ, ఎంఎస్ఎన్ మూర్తి, ఎస్.గోపీరాజు పాల్గొన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపోలో జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు డాక్టర్ వి.శారద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని 4డిపోల నుంచి ఉత్తమ మహిళా ఉద్యోగులకు నగదు బహుమతులు అందజేసి సత్కరించారు. అమలాపురం, రామచంద్రపురం, రాజోలు డిపో మేనేజర్లు చల్లా సత్యనారాయణమూర్తి, భాస్కరరావు, ధనమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్ గంగుమళ్ల రామలక్ష్మిదేవి, అసిస్టెంట్ మేనేజర్లు ప్రతిమాకుమారి, అచ్యుతాంబ, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎస్.వరహాలబాబు పాల్గొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి, చైర్మన్ బోనం కృష్ణసతీష్, బోనం కనకయ్యపాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో మహిళలు విధులు నిర్వర్తించడమంటే కత్తిమీద సాము వంటిదని ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన పోలీసుస్టేషన్లలో పనిచేస్తోన్న మహిళా పోలీసులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. మహిళా పోలీసు సీహెచ్.దుర్గాదేవి గర్భిణి కావడంతో సీమంతం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు డి.జ్వాలాసాగర్, అవినాష్, మల్లికార్జున్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోను ముందుంటేనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని మహిళా కళాశాలల కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం పేర్కొన్నారు. శనివారం ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ మహిళా జూనియర్ కళాశాల, సర్ రావుబహదూర్ రఘుపతివెంకటరత్నంనాయుడు మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆయా కళాశాలల్లో పనిచేస్తున్న మహిళా అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జగతా సురేష్, గణేశుల సతీష్, గుర్రం మహేష్, పితాని గోపాలకృష్ణ, కుసుమ నాగేంద్ర, పోలిశెట్టి ప్రసాద్, వంగా విశాల, ఆకుల దుర్గ, మోరంపూడి గీతాంజలి, దార్ల విజయ, పోలిశెట్టి మౌనిక పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో ముందుకు రావాలని ఎంపీపీ కె.వనజాకుమారి ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. మండలానికి చెందిన మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు పలువురు ఉద్యోగినులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఏవో కె.వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): మహిళలు సృష్టికి మూలమని వారిని గౌరవించడం మన సంప్రదాయమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గోడిలో ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా మహిళలను సన్మానించారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమీ, వడ్డి గంగ, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరి, దొమ్మేటి శాంతిశ్రీభవానీ, బసవాని పద్మ పాల్గొన్నారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ విస్తరణాధికారిణి నాగలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఐ.పోలవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని నక్కా సత్యకమలశ్రీమీనన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పుల్లెపు వెంకటేశ్వరరావు, గుత్తెనదీవి విస్తరణాధికారిణి మీనాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. పాతయింజరం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మహిళా పోలీస్ శ్రీదేవి, వెటర్నరీ అసిస్టెంట్ విజయలక్ష్మి, ఏఎన్ఎం అనంతలక్ష్మి పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లోను ముందుండాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పలువురు మహిళలను సన్మానించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటుందన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ పరంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ కేతా శ్రీను అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళాభివృద్ధితోనే సమాజం పురోభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం మహిళా ఎంపీటీసీలను, మహిళలను ఎంపీపీ కేతాశ్రీను- వెంకటలక్ష్మి దంపతులు దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి చీర, గిఫ్టులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంబాబు, వైస్ ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, సీనియర్ యింటిపల్లి ఆనందరాజు, ఎంపీటీసీలు దార్ల కుమారి లక్ష్మి, కొపనాతి పుష్పలత, బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, సోమిశెట్టి ధనలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ మటపర్తి లక్ష్మి, కాండ్రేగుల భవానీ, సర్పంచ్ గిడుగు బుజ్జి, సోమిశెట్టి ప్రకాష్, కొత్తపల్లి విజయలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో ప్రజలకు రక్షణ కల్పించడంలో మహిళా పోలీసుల పాత్ర ఎంతో కీలకమని కాట్రేనికోన ఎస్ఐ అవినాష్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసు సిబ్బంది, గ్రామ సచివాలయ మహిళా పోలీసులను ఆయన సన్మానించారు. ఈసందర్భంగా మహిళలు పోలీసు ఉన్నతాధికారులుగా సాధిస్తున్న విజయాలను, విధి నిర్వహణలో వారి ధైర్యసాహసాలను వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. అంబాజీపేట చాందిని బ్యాంకులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారిని పులిదిండి వీరవెంకట సత్యనారాయణ సత్కరించారు. అలాగే గోదావరి చైతన్య గ్రామీణ బ్యాంకులో మేనేజర్ రాఘవేంద్ర మహిళా ఖాతాదారులు, డ్వాక్రా సంఘాల సభ్యులను సత్కరించారు. పుల్లేటికుర్రులో విశ్రాంత ఉద్యోగి బెహర హనుమంతరావు- వెంకట సత్యసూర్యకుమారి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సర్పంచ్ జల్లి బాలరాజు ఉపకార వేతనాలు అందించారు. వైసీపీ మహిళా నేతలను నియోజకవర్గ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ ఆధ్వర్యంలో సత్కరించారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యానాం చిల్డ్రన్స్ ఆడిటోరియంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి సాంఘిక సంక్షేమశాఖాధికారి రెయ్య శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పరిపాలనాధికారి మునిస్వామి తదితరులు హాజరయ్యారు. నియోజవర్గంలోని మహిళలకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. యానాం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు ఆర్ధాని దినేష్, కాటంశెట్టి రామూర్తి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో కేక్‌లు కట్‌చేసి మహిళలకు చీరలు, స్వీట్లు పంచారు. యానాం పోలీస్‌స్టేషన్‌ల్లో స్థానిక మహిళను, ప్రముఖులను ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం ఆధ్వర్యంలో సత్కరించారు.

నేడు ఏఎస్ఎన్ కళాశాలలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆకొండి సింహాచలం సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం ఏఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ ఆకొండి పవన్‌కుమార్ తెలిపారు. బ్లూస్టార్, జెప్టో, ఫాక్స్‌కాన్, డైకిన్ కంపెనీల్లో 18నుంచి 30ఏళ్లలోపు అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పదో తరగతి నుంచి ఇంటర్, బీటెక్, డిగ్రీ చదువుకున్న వారు అర్హులని తెలిపారు.

13న ఉపాధి జిల్లా కార్యాలయం వద్ద జాబ్‌మేళా

అమలాపురం టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నటట్టు జిల్లా ఉపాధి అధికారిణి యి.వసంతలక్ష్మి తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి అమలాపురం నల్లవంతెన దిగువన ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద జాబ్‌మేలా జరుగుతుందన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్సు కాపీలతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్ 8247645389ను సంప్రదించాలన్నారు.

బొమ్మూరులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో.. విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బొమ్మూరులోని 220 కేవీ గ్రిడ్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా 160ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ సిద్దెల రాజబాబు తెలిపారు. ఈ ప్రక్రియ ఈనెల10న ప్రారంభమై ఏప్రిల్ 15వ తేదీకల్లా పూర్తవుతుందన్నారు. కోనసీమ జిల్లాలోని కొత్తపేట, అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, ఏడిద 132 కేవీ సబ్‌స్టేషన్ లోడ్స్ 220 కేవీ సామర్లకోట గ్రిడ్ సబ్‌స్టేషన్ నుంచి రాజోలు 132 కేవీ పరిధిలోని సబ్‌స్టేషన్ల నుంచి 220కేవీ గ్రిడ్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేస్తామన్నారు. లోడ్స్ మార్పే సమయంలో విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈనెలలో పెద్దగా అంతరాయం ఉండదని, ఏప్రిల్ నెలలో వేసవి కావడంతో కొద్దిగా అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. వేసవి అవసరాలను దృష్టిలో పెట్టుకుని 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్టు రాజబాబు తెలిపారు.

పశు సంచార వాహన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

అమలాపురం రూరల్, మార్చి8(ఆంధ్రజ్యోతి): పశు సంచార వాహనాలను తిప్పకుండా చేయడం వల్ల పశువులకు సక్రమంగా వైద్యం అందడం లేదని, తక్షణం 1962పశు సంచార వాహన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడుకు శనివారం ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన మంత్రిని కలిసి తమ గోడును వివరించారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ మీ ఉద్యోగాలు పోలేదని, కాంట్రాక్టరు మారిన వెంటనే అందర్నీ విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. వాహన ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని తొలుత సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా నూకల బలరామ్, అధ్యక్షుడిగా మొగలి మోహన్, ఉపాధ్యక్షుడిగా ఐ.చంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పి.నాగచంద్రబాబు, సహకార్యదర్శిగా వి.జోషి, కోశాధికారిగా పి.తేజస్వి, కమిటీ సభ్యులుగా పి.సురేష్, జి.సుజిత్‌లను ఎన్నుకున్నారు.

భక్తులతో కిక్కిరిసిన సిద్ధివినాయక ఆలయం

అయినవిల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కిక్కిరిసింది. శనివారం ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు సిద్ధివినాయకుని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకాలంకరణలు జరిగాయి. అయినవిల్లి క్షేత్రంలో భక్తుల ఈతిబాధల నివారణార్థం జరిగే శ్రీలక్ష్మీగణపతి హోమంలో భక్తులు పాల్గొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

అమలాపురం రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం డిపో గేట్ మీటింగ్ నిర్వహించారు. డ్రైవర్ కేజీ రావును బలవంతంగా టిమ్ డ్యూటీలకు పంపడం మానుకోవాలని, డ్రైవర్ బీఎస్ నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని కార్మికులు నినాదాలు చేశారు. గేట్ మీటింగ్‌లో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతిరావు, నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి పి.మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు'ను విజయవంతం చేయండి

అంబాజీపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల12న నిర్వహించే యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాసరావు కోరారు. గంగలకుర్రు అగ్రహారంలో వైసీపీ మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. వైసీపీ నేతలు మాట్లాడుతూ పథకాల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, దొమ్మేటి సత్యమోహన్, ఎం.ఎం.శెట్టి, సుదాబత్తుల రాము, మైలా ఆనందరావు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా నాణ్యమైన రోడ్డు నిర్మించాలి

పి.గన్నవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల్లో భాగంగా ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా నాణ్యమైన రోడ్డును నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. పోతవరం వద్ద జరగుతున్న రోడ్డు పనుల్లో తలెత్తిన సమస్యపై ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ పోతవరం వద్ద 400మీటర్ల కొత్త పైపులైన్‌కు, ముంగండ ప్రాజెక్టు పరిధిలోని పైపులైన్‌కు రూ.15.50 లక్షలు, మాచరం తాగునీటి ప్రాజెక్టు పరిధిలో పైపులైన్‌కు రూ.19లక్షల నిధులు అవసరమవుతాయన్నారు. ఈనిధులను మండలపరిషత్, పైపులైన్ పరిధిలోని గ్రామపంచాయతీలు నుంచి తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. రోడ్డు పనుల సమయంలో పైపులైన్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్, రోడ్డు పనులను పరిశీలించారు. అధికారులు వెంట ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

హైకోర్టు తీర్పును అమలు చేయాలి

అమలాపురం టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో శనివారం సువర్ణ ఇండియా బాధితుల సమావేశం నిర్వహించారు. సువర్ణ ఇండియా పేరిట రూ.12కోట్ల నిధులు సేకరించి బోర్డు తిప్పేయడంతో తామంతా తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సువర్ణ ఇండియా బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించామన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేయడం ద్వారా డిపాజిట్‌దారులకు న్యాయం జరుగుతుందని వివరిస్తూ ఇటీవల కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావులకు వినతిపత్రాలు అందించామన్నారు. డిపాజిట్‌దారులు కె.ప్రభుదాస్, మునునూరి శ్రీలత, గంటి ప్రసాద్, బీవీవీ సత్యనారాయణ, ఎన్.రామారావు, కె.సురేంద్రకుమార్, కె.శామ్యూల్‌రెడ్డి, జి.ఆనందరావు, యిళ్ల కనకదుర్గ, కోడూరి రామమూర్తి, వి.భానోజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోటాలో గుత్తుల సాయికి స్థానం కల్పించాలి

ముమ్మిడివరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గుత్తుల సాయిశ్రీనివాసరావుకు ఎమ్మెల్సీ కోటాలో స్థానం కల్పించాలని ముమ్మిడివరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం టీడీపీ బీసీ సెల్ సమావేశం పార్టీ అధిష్ఠానాన్ని కోరింది. పార్టీ కార్యాలయంలో బీసీసెల్ మండల అధ్యక్షుడు దంగేటి శ్రీను అధ్యక్షతన పార్టీ బీసీసెల్ సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. అమలాపురంలో శనివారం జరిగిన డీడీఆర్సీ సమావేశానికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు కూడా వినతిపత్రాన్ని అందించారు. టీడీపీ నాయకులు దొమ్మేటి రమణకుమార్, ములపర్తి బాలకృష్ణ, కట్టా సత్తిబాబు, పిల్లి నాగరాజు, రెడ్డి సుబ్బారావు, రెడ్డి శ్రీను, రెడ్డి సుధీర్, మట్టపర్తి సత్యనారాయణ, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, కుడుపూడి మల్లేశ్వరి, శీలం వెంకటేశ్వరరావు, జనిపల్లి సత్యనారాయణ, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, కురసాల శివ, గుద్దటి వీరాస్వామినాయుడు, గీసాల చంద్రరావు, పెదపూడి రుక్మిణి, కొండేటి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

మామిడికుదురు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో ప్రజలకు అవసరమైన తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు కోరారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కె.వనజాకుమారి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన తాగునీరు అందించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా కాల్వల్లో మురుగునీరు చేరకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. గృహ నిర్మాణశాఖ ద్వారా గ్రామాల్లో నూతనంగా ఇల్లు నిర్మించుకునేవారి కోసం సర్వే జరుగుతుందని గృహనిర్మాణశాఖ ఏఈ కోరారు. దీనికి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీరాజ్‌శాఖ ద్వారా మండలంలోని పలుసీసీ రోడ్లను నిర్మించామని, ఇంకా పలురోడ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాలకు వెళ్లే రోడ్డు గోతులమయమై అధ్వానంగా ఉందని, దానిని ఆధునికీకరించాలంటూ ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇంకా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామ కంఠం భూముల సమగ్ర సర్వే నిర్వహించాలి

అమలాపురం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మోడల్ విలేజ్‌లుగా ఎంపికచేసిన గ్రామాల్లో స్వమిత్వ సర్వేను సమగ్రంగా నిర్వహించాలని అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు సూచించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామకంఠం భూములన్నింటికీ సమగ్ర సర్వే నిర్వహించడం ద్వారా ప్రభుత్వం అర్హులైన వారికి ప్రాపర్టీ కార్డులు అందజేస్తుందన్నారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు స్వమిత్వ సర్వేపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వై.రామవరం ఈవోపీఆర్డీ, జిల్లా నోడల్ అధికారి యూ.నాగేంద్ర స్వమిత్వ సర్వే ఏవిధంగా నిర్వహించాలో తెలియచేశారు. గ్రామకంఠం భూముల కొలతలను గుర్తించేందుకు రోవర్ ఆపరేటింగ్ ఏవిధంగా చేయాలని, ఆధునిక టెక్నాలజీ వినియోగం తదితర అంశాలపై ఆయన శిక్షణ ఇచ్చారు. మరో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, రాకేష్ అనేక అంశాలపై శిక్షణ ఇచ్చారు.

చలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ

అంతర్వేది, మార్చి8(ఆంధ్రజ్యోతి): వీవీమెరక రోటరీక్లబ్ ఫంక్షన్ హాలులో శనివారం జనసైనికులతో కలిసి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చలో పిఠాపురం పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరణ చేశారు. రాజోలు నియోజకవర్గం నుంచి అత్యధిక జనసైనికులు, వీరమహిళలు చిత్రాడ జరిగే జనసేన ఆవిర్భావ సభకు తరలివెళ్లాలన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఆకన బాబ్జినాయుడు, గుబ్బల పణికుమార్, దిరిశాల బాలాజీ, తాడి మోహన్‌కుమార్, రావూరి నాగు, గునిశెట్టి రాంజీ, బర్రే శ్రీను పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ స్వగ్రామం రాక

ఐ.పోలవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా విజయం సాధించి తొలిసారిగా ఈనెల9న స్వగ్రామం జి.వేమవరం వస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు అభిమానులు ఘన స్వాగతం పలికేం దుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్సీ రాజశేఖరం కుటుంబసమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ రాక సందర్భంగా గుత్తెనదీవి సత్తెమ్మ ఆలయం నుంచి జి.మూలపొలం వరకు బైక్ ర్యాలీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నేడు మెగా వైద్య శిబిరం

మామిడికుదురు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జిల్లాపరిషత్ హైస్కూలు ప్రాంగణంలో ఆదివారం శ్రీసత్యసాయి మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు సత్యసాయి సేవాసంస్థ సభ్యులు తెలిపారు. సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిబరంలో అన్నిరకాల వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి రక్త, ఈసీజీ, ఎక్సరే పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారన్నారు.

ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

మలికిపురం, మార్చి8(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో ఈనెల14న జరిగే 12వ జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయడంలో ప్రతీ కార్యకర్త, ప్రతీ నాయకుడు పాలు పంచుకోవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు నియోజకవర్గం నుంచి 10వేల మంది వెళ్లాలని, సభకు వెళ్లే ప్రతీ ఒక్కరికీ అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. గుండుబోగుల పెద్దకాపు, గుండాబత్తుల తాతాజీ, తాడి మోహన్‌కుమార్, డాక్టర్ రాపాక రమేష్‌బాబు, మల్లిపూడి సత్తిబాబు, దిరిశాల బాలాజీ, బర్రే శ్రీను, గుబ్బల రవికిరణ్, ఆకుల చినవెంకన్నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రహోమం

ఐ.పోలవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీవీరేశ్వరస్వామి జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శనివారం రుద్రహోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, పూర్ణాహుతి జరిగాయి. ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా అమ్మవార్ల సేవ

అంతర్వేది, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మోరి గ్రామంలో శ్రీమహాలక్ష్మమ్మ, కనకమహాలక్ష్మమ్మవార్ల జాతర, తీర్థ మహోత్సవంలో భాగంగా ఎనిమిదో సేవా పూజా కార్యక్రమం వైభవంగా జరిగింది. మహాలక్ష్మినగర్‌వారి ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం బాణసంచా కాల్పుల నడుమ వివిధ రకాల శక్తివేషధారణలతో వైభవంగా జరిగింది. తొలుత గ్రామంలో భక్తులంతా ఆలయానికి చేరుకుని ఆసాదులతో కలిసి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి సేవా కార్యక్రమాన్ని తిలకించారు. ఆదివారం ఆకులవారి మహాజాతర, 11న మంగళవారం ముప్పర్తివారి రథోత్సవం, 12న బుధవారం నైవేద్యాలు, 13న గురువారం తెప్పోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే మోరి గ్రామంలో ఉన్న శివాలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

గోకర్ణేశ్వరస్వామి-జలదుర్గమ్మవారి కల్యాణం

అంతర్వేది, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామం చినకొల్లేరులో వెలసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి గజమాల అలంకరణ చేశారు. అనంతరం పెద్దింట్లమ్మవారి ప్రభను ఊరేగించారు. గరగ నృత్యాలు, బుట్టబొమ్మలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. రాత్రి 10.25గంటలకు మెండు ఉదయభాస్కరరావు(బుజ్జి)-అన్నపూర్ణ దంపతులతో గోకర్ణేశ్వరస్వామి-జలదుర్గమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు స్వామి-అమ్మవార్ల కల్యాణ తంతు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. తొలిసారి దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రభ ఊరేగింపుతో పాటు గోకర్ణేశ్వరస్వామి-జలదుర్గమ్మ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించినట్టు జిల్లా ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు.

ఘనంగా మహా సుదర్శన హోమం

ఆత్రేయపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వేకువజామునే స్వామివారి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను ఘనంగా జరిపారు. ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు బ్రహ్మత్వం లో వేద పండితులు పూజలు చేశారు. స్నపన మూర్తులకు అభిషేకం, మహాసుదర్శన హోమాన్ని ఘనంగా జరిపారు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారు విహరించారు. ఆలయ నిర్మాణకర్తలు పి.వెంకట సత్యనారాయణరాజు, రాజ్యలక్ష్మి దంపతులు చేతుల మీదుగా బ్రహ్మోత్సవాలను జరిపారు. ఆలయ మేనేజర్ వినయ్‌కుమార్‌రాజు వీటి ఏర్పాట్లను నిర్వహించారు. గోవిందమాలధారులు పలువురు ప్రత్యేక పూజలు చేశారు.


ఆలయంలో సుదర్శన హోమం చేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న వెంకన్న బ్రహ్మోత్సవాలు


సింహ వాహనంలో ఊరేగుతున్న స్వామివారు

రావులపాలెం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రావులపాలెం పోతంశెట్టి రామిరెడ్డి పార్క్ సమీపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కూడా బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. ఇందులో భాగంగా స్వామివారికి ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు ఆధ్వర్యంలో వాడపల్లి కమలనాథ్ అర్చకత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉదయం సింహ వాహనోత్సవ సేవ, రాత్రి ముత్యాల పందిరిసేవ జరిగింది. ఆయా ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

వారణాసిలో ఘనంగా సప్తాహ సంకీర్తనలు

ఆత్రేయపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వాగ్గేయకార సంకీర్తన వాహిని సేవా సంఘం ఆధ్వర్యంలో సప్తాహ సంకీర్తన కార్యక్రమాలను వారణాసిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆత్రేయపురం మండలం అంకం పాలేనికి చెందిన కరుటూరి వెంకటశ్రీనివాసరావు సనాతన ధర్మ ప్రచార రథయాత్ర చేపట్టి పుష్కరకాలం పూర్తి కావడంతో కాశీలోని కన్నప్ప మండపం వద్ద సామూహిక శివనామ సప్తాహ సంకీర్తనను వైభవంగా జరిపారు. తొమ్మిది రోజుల పాటు వారణాసిలో సుమారు 200 మంది దీన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.


వారణాసిలో సప్తాహ సంకీర్తన నిర్వహిస్తున్న దృశ్యం

రేపటి నుంచి విద్యుత్ సరఫరాకు స్వల్ప అంతరాయం

అమలాపురం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బొమ్మూరులోని సబ్‌స్టేషన్‌లో నూతనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ సి.రాజబాబు తెలిపారు. ఈ ప్రక్రియ 10న ప్రారంభమై ఏప్రిల్ 15వ తేదీకల్లా పూర్తవుతుందన్నారు. కోనసీమ జిల్లాలోని కొత్తపేట, అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఈ నెలలో పెద్దగా అంతరాయం ఉండదని, ఏప్రిల్‌లో కొద్దిగా అంతరాయం తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. వేసవి అవసరాలను దృష్టిలో పెట్టుకుని 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రజలు సిబ్బందికి సహకరించాలన్నారు.


అముజూరులో పార్టీ స్థూపాన్ని ఆవిష్కరించిన నాయకులు

జనసేన ప్లీనరీని విజయవంతం చేయండి

కె.గంగవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, ప్లీనరీ సమన్వయకర్త గంజి చిరంజీవి, ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జె.నాగరాజు కోరారు. శనివారం అముజూరు గ్రామంలో పార్టీ స్థూపాన్ని ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్లీనరీ సమన్వయకర్త చిరంజీవి పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన ఎంపీటీసీ తాడాల జానకీరామ్, కూటమి నాయకులు వై.గోపాలకృష్ణ, డి.చక్రి, కె.సుధాకర్, నలాది సీతారామ్, నలాది శ్రీను, చీకట్ల సోమేష్, నున్న సాయికృష్ణ, నున్న పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందపల్లి స్వామివారి ఆదాయం రూ.2లక్షలు

కొత్తపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,00,411 ఒకరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఇద్దరు విద్యార్థులకు ఆర్థికసాయం


విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్న వాసవి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

రావులపాలెం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని వాసవీ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఇద్దరు విద్యార్థులకు ఆర్థికసాయం అందించారు. ప్రైవేట్ కళాశాలలో బీటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్న బి.పుష్కర మోహన్ శ్రీరామకుమార్, బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న బి.రమ్యానాగశ్రీమహాలక్ష్మిలకు ట్రస్టు సభ్యులు ఆర్థిక సాయం అందించారు. వీరిద్దరు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ట్రస్టు దృష్టికి తీసుకురాగా హైదరాబాద్‌కు చెందిన గ్రంథి వెంకట రామ అవతారాన్ని సాయం కోరగా రూ.50వేలు అందించినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. దీంతో వారిద్దరికి సభ్యులు గోపాలం, నారాయణమూర్తి, గోపాల కృష్ణమూర్తి తదితరులు రూ.25వేలు వంతున అందించారు.

విశ్రాంత హెచ్ఎం చంద్రన్న మృతికి పలువురు సంతాపం

ద్రాక్షారామ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణానికి చెందిన విశ్రాంత హెచ్ఎం చప్పిడి చంద్రన్నకాపు(82) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రత్నంపేట మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం ఈయన పనిచేశారు. రత్నంపేట పాఠశాలను ఆయన మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దారు. 2001లో ఆయన ఉద్యోగ విరమణ చేశారు. ఈయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వైభవంగా రుద్రహోమం

ఐ.పోలవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మురమళ్ల వీరేశ్వరస్వామి జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శనివారం రుద్రహోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పి.శ్యామల కుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, పూర్ణాహుతి జరిగాయి. ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రామచంద్రపురంలో గ్రహంబెల్ అవార్డు పొందిన ఇంజనీరింగ్ విద్యార్థి శ్రావ్యను సత్కరిస్తున్న సత్యం తదితరులు


కొత్తపేటలో సర్పంచ్ జయలక్ష్మితోపాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరిస్తున్న దృశ్యం


కపిలేశ్వరపురం సీహెచ్‌సీలో పీఎంపీల సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగినులను సన్మానిస్తున్న దృశ్యం

సమాజ నిర్దేశకులు మహిళలే..

• కోలాహలంగా మహిళా దినోత్సవం • సన్మానం చేసిన పలువురు ప్రజా ప్రతినిధులు

మండపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో పోటీపడాలని మండపేట శాసనసభ్యుడు వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, హాజరయ్యారు. మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ రంగారావు మాట్లాడుతూ మహిళలు కుటుంబానికి బాసటగా నిలిచేలా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తామన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ


మండపేటలో మహిళను సత్కరిస్తున్న రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ తదితరులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీర్రెడ్డి, మెప్మా అధికారిని సుజాత, మున్సిపల్ కౌన్సిలర్‌లు, మెప్మా సిబ్బంది, ఆర్‌పీలు, మహిళలు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో: పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరిపారు. పట్టణ సీఐ సురేష్ సారధ్యంలో జరిగిన కార్యక్రమంలో కలువపువ్వు సెంటరు నుంచి మహిళలు ర్యాలీ జరిపారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ హాజరైన కార్యక్రమంలో కలువపువ్వు సెంటరు నుంచి ఆలమూరు రోడ్డులో వున్న కాపు కల్యాణ మండపం వరకు ర్యాలీ జరి


ఆలమూరు: గుమ్మిలేరులో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు శ్రీనివాస్

గింది. అనంతరం సీఐ సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు మహిళలను సన్మానించారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు పత్రాలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ బిక్కిన తాతబ్బాయిచౌదరి, పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు. అర్తమూరులో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి సారధ్యంలో గ్రామంలో మహిళ దినోత్సవాన్ని జరిపారు.

మహిళాభివృద్ధితోనే సమాజం పురోభివృద్ధి

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధితోనే సమాజం పురోభివృద్ధి సాధ్యమవుతుందని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ చెలికాని రామారావు స్మారక కమిటీ భవనంలో జరిగాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఏజీపీ ఎల్. పద్మకమలకుమారి తదితరులు మాట్లాడారు. అనంతరం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, జాతీయ స్థాయిలో గ్రహంబెల్ అవార్డు అందుకున్న దంగేటి శ్రావ్య, పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న మహిళలు, మహిళా ఆటో డ్రైవర్లు, ఏరియా ఆసుపత్రి హెడ్‌నర్స్ సూర్యకుమారిలను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరపున సత్కరించారు. స్వయం సహాయక సంఘాలకు మెప్మా ద్వారా విడుదల చేసిన రూ.3.82 కోట్ల చెక్కును మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, చైర్‌పర్సన్ శ్రీదేవి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అందించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసంశెట్టి సత్యం కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు.

సృష్టికి మూలం మహిళలే..

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): సృష్టికి మూలం మహిళలేనని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేట మేజర్ పంచాయతీ ఆవరణలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రామకృష్ణ, బూసి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని కపిలేశ్వరపురం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమార్, శ్రమ సచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ నాగేశ్వరి అన్నారు. శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కపిలేశ్వరపురం సీహెచ్‌సీలో, అద్దంకివారిలంక గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. సీహెచ్‌సీలో పీఎంపీల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు ఆధ్వర్యంలో మహిళా వైద్యులు, ఉద్యోగులను సత్కరించారు. అంగర శ్రావణి ప్రాథమిక వైద్యాలయంలో కాకినాడ లక్ష్మీసావన్ స్కిన్ కేర్‌కు చెందిన డాక్టర్ అనితని సన్మానించారు. అద్దంకివారిలంకలో శ్రమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కోఆర్డినేటర్ నాగేశ్వరి మాట్లాడారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పీఎంపీల సంఘం మండల అధ్యక్షుడు సూరంపూడి సత్యనారాయణ, అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో మల్లిఖార్జునుడు, సూరంపూడి వీరభద్రరావు, తదితరులు మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో అసోసియేషన్ సభ్యులు కె.శ్రీను, ఎం.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండల వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, సామాజిక సేవా సంస్థల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గుమ్మిలేరులో టీడీపీ నాయకుడు ఈదల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆలమూరు సర్పంచ్ నాతి లావణ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. సమతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. బహిరంగ సభ నిర్వహించారు. జై కిసాన్ అధ్యక్షురాలు భూపతి సుమతి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జాతీయ నాయకులు అక్కినేని వనజ, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేగ ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఫ్రెండ్లీ విలేజ్ పోటీల్లో ఎంపికపై హర్షం: మహిళలతోనే దేశ ప్రగతి సాధ్యమని పినపళ్ల సర్పంచ్ సంగీత సుభాష్ అన్నారు. ఆలమూరులోని విఘ్నేశ్వరస్వామి ఆలయ సమీపంలోని మైదానంలో సమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయుల కల్యాణ మండపంలో సర్పంచ్ నేలపూడి లావణ్య, గ్రామ కార్యదర్శి కె.


మండపేట మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మోక్షాంజలి ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం జరిగింది. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయిలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన 23 మంది మహిళలను సత్కరించారు. నేషనల్ ఫ్రెండ్లీ విలేజ్ పోటీలకు ఆలమూరు ఎంపికైనందున పంచాయతీ పాలక వర్గానికి అభినందనలు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో గ్రామ సచివాలయ మహిళా ఉద్యోగినులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దండంగి మమత, ఏజీపీ ఎం. అరుణకుమారి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవానీ, ఎంపీటీసీ తోలేటి సంతోషి తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

ద్రాక్షారామ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువతో కూడిన విద్యను అందించాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. శనివారం రామచంద్రపురం రాజగోపాల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైష్ణవి జూనియర్ కళాశాలను సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు శ్రీకాంత్, చంద్రకాంత్, సిబ్బంది గోవిందు, సుధీర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణను సత్కరించారు.


ఆత్రేయపురం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్ కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

పరీక్షకు వెళ్లాలంటే విద్యార్థులకు ప్రయాసే

ఆత్రేయపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మహాత్మాగాంధీ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పరీక్షకు వెళ్లాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలు పడుతున్నారు. సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న రావులపాలెం సెంటర్‌కు వెళ్లి పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం జూనియర్ కాలేజీలో పరీక్షా కేంద్రం లేకపోవడంతో ఇక్కడ విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నారు. శనివారం వస్తే వాడపల్లి వెంకన్న ఆలయానికి వెళ్లే భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ అంతరాయం తలెత్తుతోంది. బస్సుల్లో వెళుతున్న విద్యార్థులు సమయానికి చేరుకుంటామా లేదా అనే టెన్షన్‌తో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆత్రేయపురంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ఇంటర్ విద్యార్థులకు బస్సుల కోసం ఎదురుచూస్తు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకుంటామో లేదో అని తీవ్ర మానసిక ఒత్తిడికి గురై పరీక్షల మీద దృష్టిసారించలేకపోతున్నా విద్యార్థులు వాపోతున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం, ఆలమూరు, కొత్తపేట మండలాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆత్రేయపురం మండలంలో పరీక్షా కేంద్రం లేకపోవడంతో దూరప్రాంతానికి వెళ్లి పరీక్ష రాయాల్సి వస్తోందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు.


పసలపూడిలో అభివృద్ధి పనులకు శిలాఫలాకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

గ్రామాభివృద్ధికి దాతల తోడ్పాటు అవసరం

రాయవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి దాతల తోడ్పాటు అందిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పసలపూడి గ్రామాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు. శనివారం పసలపూడి గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, భూమిపూజలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. శ్మశానవాటికలో నిర్మించిన శివుడు విగ్రహాన్ని ప్రారంభించారు. అనంతరం శ్మశానవాటికలో చేపట్టనున్న అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభించారు. గ్రామంలో 26 లక్షల 50వేలతో కైలాసభూమి అభివృద్ధి పనులు చేపట్టగా 22 లక్షల 50వేలు దాతల నుంచి సహకారం అందించినట్లు కైలాస భూమి అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడి వైద్యాధికారిపై ఎమ్మెల్యే వేగుళ్ల ఆగ్రహం

మండపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండపేట మండల పరిషత్ సమావేశంలో వైద్యాధికారుల తీరుపై ఎమ్మెల్యే వేగుళ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలందించే వైద్యులు ఇద్దరు అందుబాటులో లేకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. మండపేట మండల పరిషత్ సమావేశం ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగింది. దీనికి పలుశాఖల అధికారులు గైర్హాజరు అయ్యారు. సమావేశంలో పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలను తీసుకుంటామని ప్రజా ప్రతినిధులు తెలిపారు. మండలంలో మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటులో జరుగుతున్న జాప్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆశాఖ డీఈఈతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. మండలంలో ట్రాన్సుఫార్మర్‌లు ఏర్పాటులో జాప్యం చేయవద్దని ఆయన అధికారులను ఆదేశించారు. మండల విద్యాధికారులు ఎస్.రామచంద్రరావు, సోమిరెడ్డి మాట్లాడుతూ మండలంలో 16 మోడల్ పాఠశాలలు, ఫౌండేషన్ కోర్సులు పాఠశాలలు 28 ప్రతిపాదించగా ప్రభుత్వం 9 మాత్రమే మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గటం ఆందోళన కలిగిస్తున్నదని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. కేశవరంలో హైస్కూల్‌కు ప్రహరి నిర్మించాలని ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణ కోరారు. మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూపరంగా ఏడిద, మండపేటలో అనధికార లేఅవుట్ల సమస్య ఉందన్నారు. రెవెన్యూపరంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. గ్రామాల్లో మంచి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో వున్న 23 సచివాలయాలను కుదించి 10 క్లస్టర్‌లుగా విభజించామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలతోడు, ఇప్పనపాడు, ఏడిద సీతానగరం, మెర్నిపాడు రోడ్లకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించగా నిధులు మంజూరుకు మంత్రి హామీ ఇచ్చారన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులతో పాటు వైస్ ఎంపీపీ గజ్జి వెంకటరమణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ద్వారపూడి వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల


గంటిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని రహదారుల నిర్మాణం చేపట్టిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం గంటిలో రూ.50 లక్షలతో చేపట్టనున్న ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రావులపాలెం: పొడగట్లపల్లిలో రూ.82 లక్షలతో చేపట్టబోయే మరమ్మతు పనులకు కూటమి నాయకులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 358 కేసులు పరిష్కారం

ద్రాక్షారామ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం కోర్టుల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 13వ జిల్లా అదనపు, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి, లీగల్ అథారిటీ మండల చైర్మన్ శంకరరావుచే నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 358 కేసులను పరిష్కరించారు. జాతీయ లోక్ అదాలత్‌కు సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శారద, ఏజెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్ ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించారు. జాతీయలోక్ అదాలత్‌లో సభ్యులు సీహెచ్ శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, పీఎస్ జానకి, డి.సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించారు.